క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలోకి చేరికలు



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి పంచాయతీ నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన 25 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరాయి. వారికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాలనను, వినుకొండ నియోజకవర్గంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి పార్టీలోకి చేరామన్నారు. పార్టీలో చేరిన వారందరిని వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులుగా చూస్తామని, రానున్న రోజుల్లో పార్టీలో సముచిత స్థానం కల్పిస్తాని హామీ ఇచ్చారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



రొంపిచర్ల: రొంపిచర్ల, వీరవట్నం తదితర గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని వివరించారు. వ్యాధి నిరోధక టీకాలు, తల్లులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోషక ఆహార పదార్థాలను ప్రదర్శించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమారాణి, సీడీపీవో ఉమా మహేశ్వరి, సూపర్‌వైజర్ శశీదేవి, డాక్టర్ జగన్‌మోహన్, హెల్త్ సూపర్‌వైజర్ రామయ్య, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ఎంట్రన్స్‌లో విద్యార్థుల ప్రతిభ



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని లయోలా హైస్కూల్లో జనవరి 28న జరిగిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ పరీక్షల్లో గీతమ్స్ విద్యార్థులు అత్యధిక మార్కులతో అర్హత సాధించారని కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి శుక్రవారం తెలిపారు. ప్రతీక్ శివసాయి 194, జస్వంత్ రెడ్డి 187, చేతన్ 153, హర్షిత్ 143, అరవింద్‌రెడ్డి 139 ర్యాంకులు పొంది, అర్హత సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ ఎం.కృష్ణవేణి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఈ- క్రాప్ నమోదు పత్రాల పంపిణీ



రొంపిచర్ల : మండలంలో వడ్లమూడివారిపాలెంలో శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈ- క్రాప్ బుకింగ్ పత్రాలను రైతులకు అందజేశారు. వ్యవసాయ శాఖ డీడీఏ శివకుమారి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను తప్పనిసరిగా ఈ- క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. దీంతో పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందన్నారు. ఈ- క్రాప్ బుకింగ్ పత్రాలతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. వ్యవసాయ శాఖ ఏడీఏ మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారిణి శివలలిత, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

3న జేఎన్‌టీయూఎన్‌లో మెక్సెల్ టెక్ ఫెస్ట్



నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూ నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో ఏప్రిల్ 3న మెక్సెల్ టెక్ ఫెస్ట్ నిర్వహిస్తామని ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఫెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ వైఎస్ కిశోర్‌బాబు, మెకానికల్ విభాగాధిపతి ఐఎస్ ఫణిసుష్మ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెకానికల్ విభాగాధిపతి ఫణిసుష్మ మాట్లాడుతూ ఫెస్ట్‌లో నాన్ డిస్ట్రక్టివ్ టెస్ట్, సాఫ్ట్ ఇంట్రో, 3డీ ప్రింటింగ్, క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులు టెక్ ఫెస్ట్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వెతలు తీర్చిన 'వంతెనలు'

- రూ.86 లక్షల వ్యయంతో మూడు వంతెనల నిర్మాణాలు
- పొలాలకు వెళ్లే మార్గంలో శ్రీకారం
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు





కనమర్లపూడి పెదకంచర్ల వాగుపై నిర్మించిన వంతెన

శావల్యాపురం: గత టీడీపీ పాలనలో జరగనటు వంటి అభివృద్ధి పనులు చేసిన సత్తా కల్గిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కనమర్లపూడి గ్రామంలో పెదకంచర్ల కాల్వపై రైతులు పొలాలకు వెళ్లే రహదారి మార్గం లేక నానా అవస్థలు పడేవారు. ముఖ్యంగా వర్షాలు పడే సమయంలో కాల్వ దాటలేక రైతులు పడే ఇబ్బంది అంతా ఇంతా కాదు. విషయాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు దృష్టికి రైతులు తీసుకు వెళ్లారు. సమస్యకు పరిష్కారమేమిటన్నది ఆలోచన చేసిన ఆయన వంతెనల నిర్మాణమే దీనికి పరిష్కారమని భావించారు. వీటిని వెను వెంటనే ఏర్పాటు చేయటంతో సమస్యకు పరిష్కారం లభించింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే పిచికలపాలెం గ్రామంలో ఇదే వాగు పొలాలకు వెళ్లే రైతులు అగచాట్లు పడుతుంటే స్పందించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు రూ.35 లక్షల వ్యయంతో వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో ఆ గ్రామ రైతులు తీవ్రస్థాయిలో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఇర్లపాడు గ్రామం నుంచి గుండేపల్లి పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు క్షేత్రస్థాయిలో చూసిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు రూ.21 లక్షల వ్యయంతో కల్వర్టు ఏర్పాటు చేశారు. పొలాలకు వెళ్లే రైతులు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పనితీరు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ 'మాట చెబితే చేసి చూపిస్తారు' అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కష్టాలు తీరాయి



ఇర్లపాడు నుంచి గుండేపల్లి వెళ్లే మార్గంలో మాది రెండు ఎకరాల పొలం. గతంలో వాగు మధ్యలో నుంచి నడవాలంటే ఎన్నో కష్టాలు పడేవారం. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా మా కష్టాలు తీరలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వంతెన ఏర్పాటు చేసి మార్గం సులభతరం చేశారు. అలాగే రెండు గ్రామాల మధ్య ఉన్న దూరం తగ్గింది. 400 ఎకరాలు రైతులకు రాకపోకలకు సులువైంది.

–మోదుగుల వెంకట్రావు, ఇర్లపాడు గ్రామం

రైతుల కష్టాలను తీర్చారు



మాది పిచికలపాలెం గ్రామం. మాకు తొమ్మిది ఎకరాలు సాగు భూమి ఉంది. గతంలో కొండెరు వాగు నడుంలోతు మార్గంలో గడ్డిమూటలు నెత్తిన పెట్టుకొని పొలం నుంచి రాకపోకలు చేశాం. ప్రస్తుతం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఇచ్చిన హామీ మేరకు వంతెన ఏర్పాటు చేసి రైతుల కష్టాలను తీర్చారు. కొండెరు వాగు పరిధిలో 700 ఎకరాల సాగు భూమి రైతులు మేలు చేశారు.

–తిరివిధి రామకుమారి, పిచికలపాలెం

ఆరోగ్య సురక్షతో గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

బొల్లాపల్లి: మండలంలోని గుట్లపల్లి గ్రామ సచివాలయ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. వెల్లటూరు వైద్యాధికారి పి.కృష్ణానాయక్, ప్రత్యేక వైద్యనిపుణులు జె.కిషోర్ కుమార్, కె.మాధవరావు ప్రారంభించి, వైద్య చికిత్సలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. వైద్య శిబిరంలో 526 మందికి వైద్య సేవలు పొందారని, వీరిలో 15 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి కళ్లజోళ్లు పంపిణీ చేశారని వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు ఎస్‌కే చాంద్‌బాషా, వైద్య, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేత

నరసరావుపేట: పట్టణంలోని పదో వార్డు సచివాలయంలో మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి 36 మంది జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. మాజీ కౌన్సిలర్ బి.రామకృష్ణంరాజు, వార్డు నాయకులు డి.పిచ్చిరెడ్డి, పావురాల శ్రీను, గురుప్రసాదు, అంకిరెడ్డి, బాలవెంకటేశ్వర్లు, పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై మేట్లకు శిక్షణ

నాదెండ్ల: వ్యవసాయ పనులు పూర్తి కావస్తున్న నేపథ్యంలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ ఆదేశించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎన్ఆర్ఈజీఎస్ మహిళా మేట్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 14 గ్రామ పంచాయతీల్లో ప్రతి రోజూ 800–900 మందికి ఉపాధి పనులు కల్పిస్తున్నామన్నారు. రానున్న వేసవిలో ఎక్కువ మందికి పనులు కల్పించాలన్నారు. కొలతలు, వేతనం చెల్లించే పోస్టల్, బ్యాంకు ఖాతాలపై మొబైల్ యాప్ ద్వారా హాజరు నిర్వహణ తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. ఒక్కో కూలీకి రూ.272లు చెల్లించే సమయంలో వారితో సరిపడా పనులు చేయించాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తెల్లవారుజామున 5 నుంచి పనులు ప్రారంభించి 11 గంటలకు ముగించాలన్నారు. ఫామ్ పాండ్స్, పంట కాల్వల్లో పూడికతీత, చెరువుల్లో పూడికతీత, పండ్లతోటల పెంపకంతో పాటూ గ్రామాల్లో మినీ అమృత్ సరోవర్ పథకం ద్వారా చెరువులను నిర్మించుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీవో పుష్పరాజు, టీఏ రాజు ఉన్నారు.

సకాలంలో పారిశుద్ధ్య పనులు పూర్తిచేయాలి

మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి



మూడోవార్డులో శానిటేషన్ పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నరసరావుపేట: పారిశుద్ధ్య కార్మికులు శానిటేషన్ సెక్రటరీలు చెప్పే పనిని పూర్తిస్థాయిలో చేయాలని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఉదయం రెండో డివిజన్ ఆఫీసును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, మస్టర్ పరిశీలించారు. అక్కడున్నటువంటి హాజరు, స్టాక్ రిజిష్టర్లు తనిఖీ చేశారు. తానే స్వయంగా వర్కర్స్ నుంచి హాజరు తీసుకున్నారు. కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ శానిటేషన్ సెక్రటరీలు ఏ పని అయితే చెబుతారో ఆ పనిని తూచా తప్పకుండా చేయాలన్నారు. పని చేయని వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకుని కేటాయించిన కాలవ్యవధిలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జీతాలకు సంబంధించిన సమస్యలు, అనారోగ్యం వల్ల సెలవులు కావాలన్నా కూడా పూర్తిస్థాయిలో ఇవ్వడం జరుగుతుందన్నారు. కావున ప్రతి ఒక్క వర్కర్ తమ సెక్రటరీలకు సహకరిస్తూ వార్డు పరిశుభ్రతకు తోడ్పడాలని తెలియజేశారు. అనంతరం మూడో వార్డులోని పెద్ద మసీదు పరిసర ప్రాంతాలలో వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ శానిటేషన్ అధికారులతో కలిసి అక్కడ పర్యటించారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలు చేస్తూ ప్రార్థనలు చేసేందుకు మసీదుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో ఉన్నటువంటి మసీదుల చుట్టుపక్కల, పరిసర ప్రాంతాలు ప్రతిరోజు ఊడ్చి చెత్తను తొలగించి సైడు కాలువలు శుభ్రం చేయాలన్నారు. అదే రోజు వాటిని ట్రాక్టర్ ద్వారా చెత్తను తరలించే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని శానిటేషన్ సెక్రటరీలను ఆదేశించారు. మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, శానిటేషన్ ఇనస్పెక్టర్ రామకోటయ్య, సానిటరీ సెక్రెటరీ పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా గొంటు శ్రీనివాసరెడ్డి



ప్రమాణస్వీకారం చేస్తున్న చైర్మన్ శ్రీనివాసరెడ్డి, పాలక మండలి సభ్యులు

చిలకలూరిపేట: వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నాదెండ్ల మండలం చందవరం గ్రామానికి చెందిన గొంటు శ్రీనివాసరెడ్డి, ఇతర పాలక మండలి సభ్యులతో మార్కెట్ యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి యు.యోగేశ్వరరావు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ మాజీ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు పాల్గొన్నారు. నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన గొంటు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు రైతుల సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉందన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ద్వారా రైతులకు అందాల్సిన సేవలను సంతృప్త స్థాయిలో అందించేందుకు పాలక మండలి సహకారంతో కృషి చేస్తానని చెప్పారు. తనను నియమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, నియామకానికి సహకరించిన మల్లెల రాజేష్‌నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కంజుల వీరారెడ్డి, కొలిశెట్టి శ్రీనివాసరావు, పెడవల్లి చినబాబు, చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, ఏపీఎం సుభాని, ఎంపీ రత్నారెడ్డి, పంగులూరి వెంగళరాయుడు, మాలెంపాటి రామారావు, జాలాది సుబ్బారావు, మానుకొండ విజయభాస్కరరెడ్డి, బేరింగ్ మౌలాలి, గుంజి వీరాంజనేయులు, యార్డు వైస్ చైర్మన్ మానుకొండ శ్రీనివాస వీరారెడ్డి సభ్యులు పాల్గొన్నారు.

440 మందికి వైద్య పరీక్షలు

నాదెండ్ల: విద్య, వైద్య రంగాన్ని సీఎం వైఎస్ జగన్ బలోపేతం చేస్తున్నారని ఎంపీపీ తలతోటి రాణి అన్నారు. చందవరం గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిశ్వేత, వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ అలేఖ్య 440 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందించారు. ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షేక్ మస్తాన్ వలి, ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ ప్రభావతి, ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏపీవో వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ

బొల్లాపల్లి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవోగా పులిపాటి వెంకటేశ్వర్లు ఉద్యోగ బాధ్యతలు చేపట్టినట్లు పీవో, ఎంపీడీవో వీపీ విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పనిచేసిన ఎస్.ఆంజనేయరాజు నూజెండ్ల బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూజెండ్ల ఏపీవోగా ఉన్న పి.వెంకటేశ్వర్లు విధుల్లో చేరారు.

పరీక్షలతోనే 'నీటి కాసులు'గుర్తింపు



ప్లకార్డులు పట్టుకొని ర్యాలీలో పాల్గొన్న డాక్టర్లు

నరసరావుపేట: నలభై ఏళ్ల వయస్సు పైబడిన, వంశపారపర్యంగా నీటికాసుల జబ్బు, మధుమేహం కలవారు తప్పనిసరిగా ప్రతి ఆరునెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించుకొని నీటి కాసుల వ్యాధికి గురికాకుండా చూసుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) అధ్యక్షుడు డాక్టర్ ఏపీవీ రామలింగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నీటి కాసుల వారోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ రామలింగారెడ్డి మాక్సి విజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గుంటూరు రోడ్డులోని వైద్యశాల నుంచి మల్లమ్మసెంటర్ మీదుగా గడియారం స్తంభం వరకు కొనసాగి, తిరిగి వైద్యశాలకు చేరింది. ఈ సందర్భంగా డాక్టర్ రామలింగారెడ్డి మాట్లాడుతూ మామూలు కంటి జబ్బులు శుక్లం, కండ్ల కలక, పొరలు లాంటి వ్యాధులతో ఉండే లక్షణాలను వెంటనే తెలుసుకోవచ్చన్నారు. కాని నీటి కాసుల లక్షణాలు చిట్టచివరి దశవరకు అర్థం కావన్నారు. కాబట్టి కంటి పరీక్షలు తరచుగా చేయించుకొని మందులు వాడటం వల్ల కంటిచూపును కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. డాక్టర్లు సరస్వతి, చెంచిరెడ్డి, శాంతిశ్రీ, షాలిని, సూరిరెడ్డి, ప్రకృతి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలలో స్కౌట్స్ యూనిట్ అవసరం

డీఈవో వెంకటేశ్వర్లు



నరసరావుపేట రూరల్: దేశానికి క్రమశిక్షణ కలిగిన పౌరులను అందించడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతో సహాయపడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.పార్వతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడారు. ప్రతి పాఠశాలలో స్కౌట్స్ యూనిట్ ప్రారంభించాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట లోకల్ అసోసియేషన్ నాయకుడు మామిళ్ళ కృష్ణయ్య, కండ్లకుంట ప్రధానోపాధ్యాయుడు బీవీఎస్ఎల్ వరప్రసాదు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య రక్షణకు అనేక పథకాలు

కొత్తపాలెం హెల్త్ క్లినిక్ సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు



హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల) : పేదల ఆరోగ్యం కోసం రాష్ట్రంలో అనేక పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. అందుగుల కొత్తపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వైఎస్సార్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతోందని, జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్, 104 వైద్య శిబిరాలు తదితర కార్యక్రమాల ద్వారా పేదలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో నీటి సమస్యను సైతం తీర్చామన్నారు. గుండ్లకమ్మ నదిపై బ్రిడ్జి నిర్మాణానికి అన్ని అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. మరలా ప్రభుత్వం రాగానే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. త్రీఫేస్ కరెంటు లైన్ ఏర్పాటుకు అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ విజయలక్ష్మి రాజా, మండల కన్వీనర్ దండు చెన్నయ్య, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలకు బెడ్‌షీట్ల వితరణ



బెడ్‌షీట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, దుర్గాబాబు

నరసరావుపేట: లింగం గుంట్లలోని 200 పడకల డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు ద్వారకామయి అమ్మ ఒడి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ భాగవతుల లక్ష్మీనారాయణ అందజేసిన రూ.20వేల విలువైన 190 బెడ్ షీట్లను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వైద్యశాల సూపరిండెంట్‌కు అందజేశారు. శుక్రవారం ఏరియా వైద్యశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గోపిరెడ్డి ట్రస్టు సేవలను కొనియాడారు. ట్రస్టీ దుర్గాబాబు మాట్లాడుతూ చెన్నైలోని మధురై నుంచి బెడ్‌షీట్లు తెచ్చినట్లు జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు, హాస్పిటల్ సూపరిండెంట్ మంత్రూనాయక్, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆర్ఎంవో ఏడుకొండలు, డాక్టర్లు సుష్మ, దయానిధి, సురేష్, నాయకులు పూనూరి కోటిరెడ్డి, హాలీవుడ్ రఘు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: వినుకొండరోడ్డు జగనన్న కాలనీలో నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, కామిరెడ్డి నాగిరెడ్డి, నాయీ బ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయీ, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వైఎస్సార్

వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్

రొంపిచర్ల: రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ నిలిచిపోయారని ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రమైన రొంపిచర్ల చెరువుగట్టు సెంటర్‌లో పడాల పెద్దారెడ్డి కుటుంబ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. పదకొండేళ్లపాటు కాంస్య విగ్రహాన్ని ఇదే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని పెద్దారెడ్డి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఎదురుచూశారన్నారు. ఆ కల నేటితో నెరవేరిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రూ.40కోట్లతో గ్రామంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. గ్రామానికి కేంద్రియ విద్యాలయం కూడా మంజూరైందని, త్వరలో నిర్మాణ పనులు చేపడతారని తెలిపారు. గ్రామానికి వచ్చిన వారికి గ్రామస్తులు ఎదురేగి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, చపారపు గోపాలరెడ్డి, పడాల చక్రారెడ్డి, గెల్లిచినకోటిరెడ్డి, పడాల వీరారెడ్డి, భాస్కరరెడ్డి, హనిమిరెడ్డి, మల్లారెడ్డి, మారెళ్ల శివారెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఆర్వో



ఈపూరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారి సుబ్బారావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా బూత్‌లో సిబ్బందికి అందాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. ఓటర్లకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. మండలంలో మొత్తం 46 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, ఒక్కొక్క పోలింగ్ బూత్‌కు ఆరుగురు సిబ్బంది చొప్పున ఉంటారని చెప్పారు. కనుక వారి సదుపాయాలు సక్రమంగా ఉండేలా చూడాలని బూత్ లెవల్ ఆఫీసర్లకు స్పష్టంగా చెప్పారు. అలాగే పోలింగ్ బూత్‌ల వివరాలు తెలిపే నంబర్లు, తదితర విషయాలను బూత్‌లపై సక్రమంగా నమోదు చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దారు సుధాకర్, డిప్యూటీ తహసీల్దారు వెంకటేశ్వర్లునాయక్, సర్వేయర్ శ్రీనివాసరావు ఉన్నారు.